క్లుప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ



పాన్‌గల్: మండలంలోని కేతేపల్లిలో గుండెపోటుతో ఆదివారం మృతిచెందిన చాకలి బీమయ్య కుటుంబాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు పార్టీ కార్యకర్తలతో పరామర్శించి, మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు అన్వేష్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి రాయినిపల్లిలో కంటివెలుగు



పాన్‌గల్: మండలంలోని రాయినిపల్లిలో సోమవారం నుంచి కంటివెలుగు శిబిరం నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం గ్రామంలో కంటివెలుగు శిబిరానికి సంబంధించిన కరపత్రాలను పంచుతూ అవగాహన కల్పించారు. 18ఏళ్లు పైబడిన వారందరూ కంటి పరీక్షలు చేయించుకునేలా వైద్య సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ టీచర్లు ప్రచారం చేయాలని ఆదేశించారు. గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

లీకేజీ నీటితో రహదారి బురదమయం



అమరచింత: మిషన్ భగీరథ నీటి లీకేజీల కారణంగా మరికల్, ఆత్మకూర్ ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌కు సమీపంలో ఉన్న ప్రధాన రహదారిపై భగీరథ పైప్‌లైన్ లీకేజీ కారణంగా ఎల్లప్పుడు నీరు నిల్వ ఉండటంతో బీటీ రహదారి గుంతలమయంగా తయారైంది. దీంతో ఈ రహదారిపై ప్రయాణం ఇబ్బందిగా మారుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా పైప్‌లైన్‌ల లీకేజీని అరికట్టి, బీటీ రహదారికి మరమ్మతు చేపట్టాలని పట్టణ ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

పరీక్షలు ప్రశాంతం



మదనాపురం: సాంఘిక సంక్షేమ కళాశాల, పాఠశాలలో ఆరో తరగతి, ఇంటర్ ప్రవేశాల కోసం ఆదివారం మదనాపురం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించిన అర్హత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 337 మంది విద్యార్థులకు గాను 317 మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు. మహబూబ్‌నగర్ ఈస్ట్ రీజనల్ ఆర్సీఓ వనజ, చీఫ్ సూపరింటెండెంట్ రవీందర్ పరీక్ష కేంద్రాన్ని పర్యవేక్షించారు.

మైసమ్మ జాతరలో భక్తుల రద్దీ



పెద్దకొత్తపల్లి: మండలంలోని నాయినోనిపల్లి మైసమ్మ జాతరకు ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. వేరుశనగ, మినుములు, పెసర పంటలు చేతికందడంతో రైతులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. గద్వాల, పెబ్బేరు, వనపర్తి, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ ప్రాంతాల నుంచి రైతులు, వ్యవసాయ కూలీలు సొంత వాహనాల్లో తరలివచ్చారు. నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట, వనపర్తి ఆర్టీసీ బస్సులలో ప్రయాణికులను చేరవేశారు.

వార్డు గదిని బాగు చేయించండి

అడ్డాకుల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వార్డు గది నిరుపయోగంగా మారింది. రోగులకు చికిత్స అందించే వార్డు గదిలో ఏడాదిన్నర కిందట పైకప్పు సీలింగ్ ఊడిపోయింది. పైకప్పు నుంచి వర్షాకాలంలో నీళ్లు కిందకు లీకవడంతో సీలింగ్ ఊడి కిందపడింది. దీంతో అప్పటి నుంచి ఆ గదిని వైద్య సిబ్బంది పూర్తిగా మూసి వేసి ప్రస్తుతం దాన్ని స్టోర్ రూంగా వాడుతున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులను ఇతర గదుల్లో ఉంచి చికిత్స చేస్తున్నారు. ఆరు బెడ్ల ఆస్పత్రిలోని ఒక్క గది సీలింగ్ ఊడిపోయి పైకప్పు నుంచి ఇనుప రాడ్లు, ఇతర వస్తువులు కింద పడుతుండటంతో ఆ గదిని ఎప్పుడు మూసి ఉంచుతున్నారు.

హరితహారానికి ఏర్పాట్లు

- గ్రామ నర్సరీల్లో 80శాతం మొక్కలు
- 20 శాతం బ్యాగుల్లో రెండోసారి విత్తనాలు నాటించిన అధికారులు
- ఈ ఏడాది లక్ష్యం 2.67 లక్షలు



మామిడిమాడలో మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

ఖిల్లాఘనపురం: ప్రతి గ్రామంలో వేల సంఖ్యలో మొక్కలను పెంచి వాతావరణ కాలుష్యాన్ని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హరితహారం కార్యక్రమానికి నిర్వహిస్తోంది. ఇప్పటికే 8 విడతల్లో ప్రతి గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాలను అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున చేపట్టారు. ఈ ఏడాది చేపట్టే తొమ్మిదో విడత హరితహారం కార్యక్రమం కోసం మండల, గ్రామ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు ముమ్మరంగా ఏర్పాట్లు మొదలు పెట్టారు. ఎంపీడీఓ విజయ్‌కుమార్ ప్రతి గ్రామంలో పర్యటించి నర్సరీల్లో మొక్కలు పెంచేందుకు పంచాయతీ కార్యదర్శులు, కూలీలకు సూచనలు చేస్తున్నారు.

ప్రతి గ్రామంలో..

ప్రభుత్వం గతంలో కొన్ని గ్రామాలను ఎంపిక చేసుకుని లక్ష మొక్కల చొప్పున పెంచేవారు. కొత్త రెవెన్యూ చట్టంలో హరితహారం పథకాన్ని చేర్చడంతో ప్రతి గ్రామ పంచాయతీలో తప్పనిసరిగా నర్సరీని ఏర్పాటు చేస్తున్నారు. మండలంలో మొత్తం 27 పంచాయతీలు ఉండగా అన్ని గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కలు పెంచే పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రతి గ్రామ పంచాయతీలో కనీసం 10 వేల మొక్కలకు తక్కువ కాకుండా పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

2.67 లక్షల మొక్కల పెంపకం

మండలంలో మొత్తం 27 పంచాయతీలకు గాను ఒక్కో పంచాయతీలో 10వేల మొక్కల చొప్పున మొత్తం 2.67 లక్షల మొక్కలు పెంచనున్నట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా గతేడాదికి సంబంధించిన మొక్కలు 20 వేలు ఉన్నట్లు వారు చెప్పారు. ఖిల్లాఘనపురం మండలంలో ఇప్పటికే అన్ని గ్రామాల్లో మొక్కలు పెంచేందుకు కావల్సిన పనులు పూర్తి చేశామని, 80 శాతం మొక్కలు ఫీట్ ఎత్తు పెరిగాయని అధికారులు చెబుతున్నారు. మొక్కలు వేగంగా పెరిగేందుకు పంచాయతీ కార్యదర్శులు నిత్యం నర్సరీలను సందర్శించడంతో పాటు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

జూన్ నాటికి సిద్ధం



జూన్ నాటికి మండలంలోని అన్ని గ్రామాల నర్సరీల్లో మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉంచుతాం. మొలకెత్తని బ్యాగుల్లో మళ్లీ విత్తనాలు నాటించే పనుల్లో పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. కేవలం 20శాతం బ్యాగుల్లో మొలకలు రాలేదు. ప్రతిరోజు మొక్కలకు నీళ్లు పట్టేలా కూలీలను అందుబాటులో ఉంచాం.

– విజయ్‌కుమార్, ఎంపీడీఓ, ఖిల్లాఘనపురం

పద్మశాలి సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక



నూతన అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న సంఘం నాయకులు

వనపర్తి: పద్మశాలి సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా కేంద్రంలోని నాగవరం ఆర్టీసీ విశ్రాంతి ఉద్యోగుల సంఘం భవనంలో జిల్లా పద్మశాలి సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ సేవా సమితి చైర్మన్ రావిరాల శ్రీనివాసులుతోపాటు గంజి శ్రీనివాసులు, ఆళ్లగడ్డ రవి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడిగా జన్ను వెంకటనారాయణ ఎన్నుకున్నారు. అలాగే, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నీలినారాయణ, ప్రధాన కార్యదర్శిగా కెంచె బాలప్ప, కోశాధికారిగా చెన్న సత్యనారాయణ ఉపాధ్యక్షులుగా కొంగరి మాణిక్యం, క్యామ వెంకటేష్, సంబారి మాదన్న, కోడం సుధాకర్, దేవరకొండ మోహన్‌ను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో జిల్లాలోని 14మండలాల కమిటీలు పాల్గొన్నాయి. అదేవిధంగా, జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలిగా చెన్న పద్మమ్మ, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా గంజి వెంకట్రాములు, చేనేత జిల్లా అధ్యక్షుడిగా సాక నరసింహను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర పద్మశాలి సంఘం ప్రధానకార్యదర్శి గంజి శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం వారిని సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు.

రెడ్ల అభ్యున్నతికి కృషి



వెంకట్రామిరెడ్డిని సన్మానిస్తున్న సంఘం సభ్యులు

కొత్తకోట: మండలంలోని మిరాసిపల్లిలో ఆదివారం నూతనంగా రెడ్డి సంఘాన్ని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా వెంకట్రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అయ్యపురెడ్డి, ఉపాధ్యక్షుడిగా శేఖర్‌రెడ్డి, కోశాధికారిగా మోహన్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ రెడ్డి సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ సంఘం బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. సంఘ నిర్మాణం అనేది సామాజిక స్పృహ అని, రెడ్ల ఐక్యత పేదవారిని ఆదుకోవడం కోసం పనిచేస్తుందన్నారు. వ్యక్తిగత, రాజకీయ, మతపర విషయాలకు తావులేకుండా అందరూ పనిచేయాలని ఆయన కోరారు.

కరాటే విద్యార్థుల ప్రతిభ



పతకాలు అందిస్తున్న కరాటే మాస్టర్లు

వనపర్తి: మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల పట్టణంలో ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి 4వ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో వనపర్తి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మొత్తం 400 మంది విద్యార్థులు హాజరైన ఈ పోటీల్లో వనపర్తి షోటోకా కరాటే అసోసియేషన్ విద్యార్థులు వివిధ విభాగాల్లో పతకాలు సాధించారని కరాటే మాస్టర్లు కిరణ్‌చారి, రాజ్‌కుమార్ తెలిపారు. కటాస్ విభాగంలో శ్రీనిధి, మనోజ్ఞ, సాత్విక, ప్రణయ్, స్పైరింగ్ విభాగంలో మనోజ్ఞ, శ్రీనిధి బంగారు పతకం సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి విద్యార్థులను అభినందించారు.

బండలాగుడు పోటీల ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న నాయకులు

కొల్లాపూర్: ఈదమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా కొల్లాపూర్‌లో నిర్వహించ తలపెట్టిన బండలాగుడు పోటీల ఏర్పాట్లను ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు పరిశీలించారు. ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి సహకారంతో ఈనెల 28 మార్చి 1వ తేదీన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. బండలాగుడు పోటీలు నిర్వహించే స్థలాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మీతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు పరిశీలించారు. ఈ పోటీలను విజయవంతంగా నిర్వహించాలని రైతు సంఘాల నాయకులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్ రెడ్డి, రాంచందర్‌యాదవ్, చంద్రశేఖరాచారి, బండల వెంకటస్వామి, రుక్మద్దీన్, కాటం జంబులయ్య, సాకలి నర్సింహ, బ్యాంగి లక్ష్మణ్, గిరి, అర్జున్ తదితరులున్నారు.

హర హర మహాదేవ.. శంభోశంకర



స్వామివారికి దాసంగాలు పెడుతున్న భక్తులు

ఆత్మకూర్: పట్టణం శివారులోని చెరువులో వెలసిన స్వయంభూ పరమేశ్వరస్వామి జాతరను పురస్కరించుకొని ఆదివారం పూజారి కర్బసయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించి ఉత్సవ మూర్తి విగ్రహాలను ఆలయంలోని శివలింగంపై అలంకరించారు. భక్తులు భక్షాలు, పచ్చిపులుసు, అన్నాన్ని స్వామివారికి నైవేద్యంగా సమర్పించి దాసంగాలు పెట్టారు. జాతర ప్రారంభమై వారం రోజులు పూర్తయిన సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు జాతర కమిటీ కన్వీనర్ రవికుమార్‌యాదవ్, పూజారి కర్బసయ్య తెలిపారు. ప్రతి శని, సోమవారాల్లో ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయని, హోలీ పండుగ వరకు పూజలు కొనసాగుతాయని భక్తులు పాల్గొనాలని కోరారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



పూజల్లో పాల్గొన్న ఎస్‌ఐ మహేష్‌గౌడ్



కుండలు కొనుగోలు చేస్తున్న భక్తులు

యువకుడి అదృశ్యం



చిన్నంబావి: మండలంలోని మియాపూర్‌కు చెందిన గుజ్జ మల్లేశ్ జనవరి 29 నుంచి కనబడడం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. గొర్రెల కాపరిగా పనిచేస్తున్న మల్లేష్ రెండు నెలల కిందట జోగులాంబ గద్వాల జిల్లా బోరెల్లిలో గొర్రెలు మేపేందుకు వలస వెళ్లాడు. ఈ క్రమంలో జనవరి 29వ తేదీ నుంచి అతడు కనబడటం లేదని, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ తెలియడం లేదని కుటుంబ సభ్యులు వాపోయారు. ఇతడికి నత్తి ఉందని, మాటలు స్పష్టంగా రావని వారు పేర్కొన్నారు. ఇతడి ఆచూకీ తెలిసిన వారు 90103 30913, 93918 30804 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

సైనిక్ స్కూల్‌కు గిరిజన విద్యార్థి



ఖిల్లాఘనపురం: మండలంలోని కోతులకుంటతండాకు చెందిన కెతావత్ కిరణ్ కోరుకొండ సైనిక్ స్కూల్, ఎస్‌ఎస్‌ఏస్‌కు ఎంపికయ్యాడు. రైతు కుటుంబానికి చెందిన రాజు, బుజ్జమ్మ దంపతుల కుమారుడు కిరణ్ వట్టెం నవోదయ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. శనివారం విడుదలైన సైనిక్ స్కూల్ ఎంట్రెన్స్ పరీక్షా ఫలితాల్లో కిరణ్‌కు అర్హత సాధించాడు. సైనిక్ స్కూల్‌లో కుమారుడు సీటు సంపాదించడంపై తల్లిదండ్రులతో పాటు సర్పంచు శ్రీనినాయక్ తదితరులు ఆనందం వ్యక్తం చేశారు.

ప్లంబింగ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

కొత్తకోట: ఎలక్ట్రీకల్, హార్డ్‌వేర్, ప్లంబ్లింగ్, శానిటరీ సంఘం ఎన్నికను ఆదివారం కొత్తకోటలో నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా అబ్దుల్ లతీఫ్, ప్రధాన కార్యదర్శిగా దశరథరెడ్డి, కోశాధికారిగా శ్రీనివాసచారి, ఉపాధ్యాక్షులుగా ఇస్మాయిల్, కళాయచారి ని సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం బాధ్యులు మిగతా సభ్యులకు ధన్యావాదాలు తెలియజేశారు. సంఘంలో ఉన్న సభ్యుల అభ్యున్నతికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

వాకింగ్ ట్రాక్ నిర్మాణమెప్పుడో..



అమరచింత: పట్టణంలోని జెడ్పీఉన్నత పాఠశాల ఆవరణంలో నిర్మిస్తామన్న వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులు మందకొడిగా కొనసాగుతున్నాయి. నాలుగు నెలల కిందట పాఠశాల మైదానంలో వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలని పట్టణ యువకులు, వాకర్లు కోరగా మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు స్పందించి వాకింగ్ ట్రాక్ నిర్మాణం కోసం తీర్మాణం చేశారు. యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడతామన్న అధికారులు.. ఇప్పటి వరకు మట్టిని మాత్రమే వేశారు. పాఠశాల ఆవరణంలో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం క్రీడాకారులతో పాటు వాకర్లు చేరి వ్యాయమం చేస్తుంటారు. రూ.ఐదు లక్షలతో చేపట్టాల్సిన వాకింగ్ ట్రాక్ పనులు వెంటనే చేపట్టాలని కోరుతున్నారు.

కమ్యూనిటీ పోలీసింగ్‌పై అవగాహన



బిజినేపల్లి: తిమ్మాజీపేట మండలంలోని గుమ్మకొండలో ఆదివారం కమ్యూనిటీ పోలీసింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ మేరకు డయల్ 100 ప్రాముఖ్యత, మద్యం తాగి వాహనాలు నడపడం, బాల్య వివాహాలు వంటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ ఖాదర్ మోహినిద్దీన్ మాట్లాడుతూ మద్యం తాగి వాహనం నడిపితే జరిమానాతో పాటు కోర్టు ఆదేశాల ప్రకారం జైలు శిక్ష కూడా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్స్ బాలస్వామి, శరత్‌గౌడ్, హోంగార్డు కుమార్, గుమ్మకొండ గ్రామ యువత, ప్రజలు పాల్గొన్నారు.

భజన పోటీల్లో తాటిపాముల భక్తులు



భజన చేస్తున్న తాటిపాముల గ్రామస్తులు

పెబ్బేరు రూరల్: నాగర్‌కర్నూల్ జిల్లాలోని బిజినేపల్లి మండల కేంద్రంలో అనంతగిరి గోదాలక్ష్మి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా భజన పోటీల్లో శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములకు చెందిన రామాంజనేయ భజన బృందం పాల్గొని అద్భుత ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ భజన సాంప్రదాయం చాలా గొప్పదని, భవిష్యత్ తరాలకు పద్యాల గొప్పతనం తెలియజెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో భజన బృందం తిరుపతిరెడ్డి, బాలస్వామి, వెంకటస్వామి, సిద్ధయ్య, నరసింహ, నవీన్, శశికుమార్, నరేష్, మధు, మహారాజు, నాగరాజు పాల్గొన్నారు.

బహుజన రాజ్యాధికారమే లక్ష్యం: బీఎస్పీ



శ్రీరంగాపురం నుంచి అలంపూర్ వెళ్తున్న బీఎస్పీ నాయకులు



చిన్నంబావిలో..

పెబ్బేరు రూరల్: రెండో విడతలో భాగంగా అలంపూర్ నియోజకవర్గంలో నిర్వహించే బహుజన రాజ్యాధికార యాత్ర ప్రారంభ సభ కు ఆదివారం శ్రీరంగాపురం మండల బీఎస్పీ కన్వీనర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు వాహనాల్లో భారీ సంఖ్యలో బయలుదేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బహుజన రమేష్, ప్రధాన కార్యదర్శి ఎంపీటీసీ ఎల్లస్వామి, నాయకులు అర్సి భీసన్న, చంద్రశేఖర్, గుడిసె ధర్మ, సెక్టార్ అధ్యక్షుడు కురుమన్న, విష్ణు పాల్గొన్నారు.

చిన్నంబావి: అలంపూర్ నియోజకవర్గంలోబహుజన సమాజ్‌పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన యాత్రకు చిన్నంబావి బీఎస్పీ నాయకులు తరలి వెళ్లారు. బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు నిరంతరం పాటు పడతామని వారు తెలిపారు. కేవలం ఓట్లు వేసే యంత్రాలుగా ఉన్న బహుజనులను బహుజనుల రాజ్యం వైపు నడిపిస్తున్న వ్యక్తి డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అని కొనియాడారు. తెలంగాణలో గడీల పాలనకు వ్యతిరేకంగా బడుగు బలహీన వర్గాల నుంచి ఏ వ్యక్తి ముందుకు రానప్పుడు నేనున్నానని ఉద్యోగాన్ని వదిలి బహుజనులకు రాజ్యాధికారం అందించేందుకు ప్రవీణ్‌కుమార్ పోరాడుతున్నారాన్నరు. కార్యక్రమంలో బీఎస్పీ అసెంబ్లీ కార్యదర్శి బొల్లి కురుమయ్య, మండల అధ్యక్షుడు దేవని రాజు, మండల ఉపాధ్యక్షుడు బాలు, కార్యదర్శి కృష్ణ, బీవీఎఫ్ సాయికుమార్, బాలకృష్ణ, రమేశ్, గోవిందు, విధాత పాల్గొన్నారు.

పద్మనాభస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాలి



పద్మనాభస్వామి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రానికి సమీపంలో మహ్మద్‌హుస్సేన్‌పల్లి రోడ్డులో ఉన్న అల్లిపేట గుట్టపై ఉన్న పద్మనాభస్వామి ఆలయాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేయాలని భజరంగ్‌దళ్ మండల అధ్యక్షుడు బెస్త శ్రీను, బీజేపీ జిల్లా కిసాన్ మోర్చ ఉపాధ్యక్షుడు రాంరెడ్డి కోరారు. ఆదివారం వారు బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో దేవాలయ ప్రాంతాన్ని పరిశీలించి, స్వామివారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ శాఖ నిధులను పురాతన దేవాలయాల అభివృద్ధికి ఉపయోగించాలన్నారు. అలా కాకుండా ప్రస్తుత ప్రభుత్వం ఆలయాల నుంచి వచ్చే నిధులను మైనారిటీల మదర్సాలలో వినియోగిస్తున్నారని ఆరోపించారు. ఏళ్ల తరబడి ప్రభుత్వ ఆధీనంలో ఉండి అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న అల్లిపేట గుట్టపై ఉన్న పద్మనాభస్వామి ఆలయం ఎందుకు గుర్తుకు రావడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి ఈ దేవాలయంతో పాటు ఖిల్లా గట్టును అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అంజనేయులు, శివశంకర్, ఉపాధ్యక్షుడు రాంచంద్రి, యువమోర్చా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం, నాయకులు శాంతయ్య, కొండల్, రాములు నాయక్, శశిధర్‌రెడ్డి ఉన్నారు.

వెలిగిన వీధి దీపాలు

ఆత్మకూర్: స్థానిక జమేదార్ వీధిలో విద్యుత్ స్తంభాలకు చెట్ల తీగలు అల్లుకుపోవడంతో వీధి దీపాలు వెలగకపోవడంతో పాటు తరుచూ విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని కాలనీ వాసులు సాక్షి దినపత్రిక ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 'సాక్షి ఫోన్ ఇన్' కార్యక్రమంలో సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కమిషనర్ సమస్యను పరిష్కరించాలని మున్సిపాలిటీ ఎలక్ట్రీషియన్ ఇస్మాయిల్‌ను ఆదేశించారు. వెంటనే ఆయన సిబ్బందితో కలిసి విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న తీగలను తొలగించి విద్యుత్ దీపాలను పునరుద్ధరించారు. దీంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.



విద్యుత్ స్తంభానికి అల్లకున్న తీగలు (ముందు)



తీగలు తొలగించి వీధి దీపాలు అమర్చిన దృశ్యం (ప్రస్తుతం)

తండాల అభివృద్ధికి కృషి చేశాం



మాట్లాడుతున్న మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు

కోడేరు: తన హయాంలోనే తండాలు అభివృద్ధి చెందాయని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం మండలంలోని నార్యనాయక్ తండా, ఎర్రన్నబావితండాలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు గ్రామాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని నాగులపల్లి మెయిన్ రోడ్డు నుంచి మూలమడత తండా, ఎర్రన్నబావితండా, నార్యనాయక్ తండా, మైలారం, చిక్కేపల్లి తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.6కోట్ల నిధులు మంజూరు చేశానని అన్నారు. అయితే ఇప్పటి పాలకులు నాలుగేళ్లు గడుస్తున్నా పనులు పూర్తి చేయకుండ పబ్బం గడుపుతున్నారని అన్నారు. పాలకులు తండాలకు వచ్చినప్పుడు పనులు ఎందుకు పూర్తి చేయలేదని నిలదీయాలని సూచించారు. తన హయాంలోనే 500 జనాభా ఉన్న తండాలను నూతన గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేశామన్నారు. అనంతరం మూలమడత తండాలో బొడ్రాయి పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొత్త రాంమోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.